క్లుప్తంగా

రెండు నెలల్లో రెండు అవార్డులు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న ఎస్సై కోటయ్య

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్ అధికారి జి.కోటయ్య రెండు నెలల వ్యవధిలో రెండు అవార్డులు అందుకుని గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నికలు, కౌంటింగ్ సమయంలో శాంతిభద్రలను అదుపులో ఉంచడంతో పాటు పొదిలి ప్రాంతంలో సంచలనం కలిగించిన నరేంద్ర హత్యకేసును వారం రోజుల్లో ఛేదించారు. ఈ రెండింటికి గాను ఎస్పీ దామోదర్ శనివారం ఆయనకు ప్రశంస పత్రం అందించారు.

ఎప్పుడు ఏం జరుగుతుందో!



చినారికట్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బోరు

కొనకనమిట్ల: గతంలో ప్రమాదవశాత్తు బోరు బావి గుంతల్లో చిన్నారులు పడి మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయి. బోర్లు వేసిన తరువాత నీరు పడని సందర్భాల్లో ఆ పైపులకు మూతలు ఏర్పాటు చేకుండా నిర్లక్ష్యంగా వదిలేయటంతో చిన్నారులు వాటిలో పడి మరణిస్తున్నారు. అలాగే మండలంలోని చినారికట్ల నుంచి పెదారికట్ల వెళ్లే రహదారి పక్కనున్న పొలంలో రైతులు ఇలా బోర్లు వేసి పూడ్చకుండా వదిలేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: జాతీయ రాహదారి కొనకనమిట్ల సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ మాధవరావు తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడి శోచనీయం



మురారి వెంకటేశ్వర్లు

తర్లుపాడు: విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చేందుకు ప్రయతి్నంచడం శోచనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మాట్లాడుతూ రాజ్యాంగ యోధుడిగా ఆయన దేశానికి చేసిన సేవలు మర్చిపోలేమని, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ. 404.35 కోట్లతో విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి ఈ ఏడాది జనవరి 19న జాతికి అంకితం చేశారన్నారు. కానీ మహనీయుల విగ్రహాలపై అల్లరిమూకలు దాడులు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యులంతా ఖండించాలని కోరారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి



పోటీలు ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్ బాలాజీ, షంషేర్ అలీబేగ్, కాశయ్య

మార్కాపురం: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని మార్కాపురం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యం. బాలాజీ అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలకు క్రికెట్ పోటీలను కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపని కాశయ్యతో కలిసి ప్రారంభించారు. అసోసియేషన్ కార్యదర్శి అనీల్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవోపేతంగా ప్రతిష్టా మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని పేరారెడ్డిపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్న సీతాలక్ష్మణ హనుమత్ సహిత పట్టాభిరామచంద్ర స్వామి జీవ, ధ్వజ, పోతురాజుస్వామి సహిత పోలేరమ్మ దేవతా ప్రతిష్ఠ మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం, జయజయ ధ్వానాలతో నిర్వహిస్తున్నారు. శనివారం నూతన విగ్రహ, జీవ, ధ్వజ ప్రతిష్టా, నవగ్రహ, గణపతి సుబ్రమణ్య, నాగేంద్ర స్వామి, శీతలాదేవి గమిడి దేవతల గ్రామోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలతో గంగా నయనం, గణపతిపూజ, అఖండదీప ప్రతిష్ట, మండపారాధన, అంకురారోహణ, సహస్రనామపూజ, రుద్రహోమాలు, నవగ్రహహోమం, కంకణధార, అభిషేకాలు, అర్చనలు వేడుకగా నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవాలు వేదపండితులు గూడా నారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కలశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు కంకణాలు ధరించి హోమాలు, అభిషేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని నైవేద్యాలు సమర్పించి, కలశస్థాపన, హోమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతిష్టామహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం పుణ్యాహవాచన హోమం, రాములవారి మూలవిరాట్ ప్రతిష్ట, ధ్వజస్తంభ స్థాపన, సీతారాముల శాంతి కల్యాణం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

మార్కాపురం రూరల్: మండలంలోని మన్నెంవారిపల్లిలో శనివారం వనభోజనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాలు తలపై పెట్టుకుని రాములవారి ఉత్సవ విగ్రహాలతో పొలాల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో పూజలు నిర్వహించారు. అక్కడ నైవేద్యాలు వండి స్వామికి నైవేద్యంపెట్టి గ్రామస్తులందరూ సహపంక్తి భోజనాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. శ్రీవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్



అలంకరణలో శ్రీవారు

చెన్నకేశవస్వామికి శాంతి పూజలు

మార్కాపురంటౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామివారికి శనివారం ప్రత్యేక శాంతి పూజలను అర్చకులు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు, పేదలకు అన్నదానం జరిగింది. ఉభయదాతలు గొలమారి విష్ణువర్ధన్ రెడ్డి, రత్నకుమారి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలోకి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారిచే ఆలయ పూజారి దివి శ్రీకాంత్ భట్టర్ ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాల పంపిణీ అనంతరం భక్తులకు,పేదలకు అన్నదానం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నారాయణ, ఓబులశెట్టి నరేంద్ర, సాయి పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఉభయదాతలు



రేగడపల్లిలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఉభయదాతలు



వేడుకగా నిర్వహిస్తున్న గ్రామోత్సవం



మన్నెంవారిపల్లిలో వనభోజనాలకు వెళ్తున్న మహిళలు

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కొనకనమిట్లలో యూటీఎఫ్ జెండావిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు



వీరారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొనకనమిట్ల: మండల కేంద్రం కేంద్రం కొనకనమిట్లలో శనివారం మండల యూటీఎఫ్‌శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై మాట్లాడుతూ యూటీఎఫ్ సంఘం చేసిన ఉద్యమాలే అనేక హక్కులను సాధించామన్నారు. కౌన్సెలింగ్ విధానం, అప్రెంటీస్ రద్దు వంటి కార్యక్రమాలను సాధించామని తెలిపారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో జరుతున్న వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జీఓ నంబరు 117, 128 ద్వారా చేయడం వలన మెర్జింగ్ హైస్కూల్లో ఎక్కువ సెక్షన్లు ఉండి తక్కువ మంది ఉపాధ్యాయుల పని భారం ఎక్కువవుతుందని తెలిపారు. ఎంఈఓ-2 బరిగె నరసింహారావు మాట్లాడుతూ రీ గ్రూప్ ఇన్ స్కేల్, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం, పీఆర్సీలు, డీఏలు పొందారన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, సుబ్రమణ్యాచారి, బాదుల్లా, కామేశ్వరరావు, కృపారావు, కాసు తిరుపతిరెడ్డి, ఆంజనేయచౌదరి, కె.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ఖాసీం, చెంచురామారావు, ప్రభాకర రెడ్డి, వెంకటేష్, మాల్యాద్రి, వలిరాజు పాల్గొన్నారు.

పొదిలి: యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని మానవ వనరులు కేంద్రం వద్ద జెండా ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకానికి యూటీఎఫ్ అందించిన సేవలను కొనియాడారు. యూటీఎఫ్ అగ్ర నాయకులు సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఏ.వీరారెడ్డి తదితర రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా సహధ్యక్షులు అబ్దుల్‌హై, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసరావు, బాలకాశిరెడ్డి, లుక్కాని వెంకటేశ్వర్లు, సింగంపల్లి సుబ్బారావు, జేవీవీ నాయకులు కె.సుబ్రమణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తూనే ఉంటుందని జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా పతాకాన్ని జిల్లా మున్సిపల్ టీచర్స్ కోఆర్డినేటర్ రవికుమార్, ప్రభాకర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం త్వరగా మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. నాయకులు శ్రీరాములు, పాపయ్య, యలమందారెడ్డి, చంద్రశేఖర్, వెంకటరావు, పి. వెంకటేశ్వర్లు, ఖాశింపీరా పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ భర్త మృతి

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల మాజీ ఎంపీపీ పోలమ్మ భర్త పోలయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి చింతగుంట్ల వెళ్లి పోలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కాగా బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, రంగస్వామి గౌడ్, బుర్రి చిన్నవెంకటేశ్వర్లు, మందటి శివారెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి

ముమ్మరంగా పొగ నాట్లు



పొగ నారు వేస్తున్న కూలీలు

దొనకొండ: మండలంలో పలు గ్రామాల్లో రైతులు పొగ నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల నుంచి చిరు జల్లులు కురవడంతో రైతులు పొగ నాట్లపై దృష్టి సారించారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళి పొగ నారు కొనుగోలు చేసి పొలాల్లో నాటుతున్నారు. గత ఏడాది పొగాకు ఉత్పత్తి, నాణ్యమైన గిట్టుబాటు ధర లభించింది. దీంతో ఈ ఏడాది రైతన్నలు పొగాకుపై కన్ను వేశారు. గ్రామాల్లో రైతులు పోటీలు పడి ఎకరాలు, ఎకరాలు సాగు చేస్తున్నారు. ఓ పక్క పొగాకు బోర్డు వారు ఈ ఏడాది పొలం విస్తీర్ణం తగ్గించుకుని పొగ నారు నాటమంటున్నారు. గిట్టుబాటు ధర ఉండక పోవచ్చని పొగాకు బోర్డు వారి అంచనా. రైతన్నలు మాత్రం ధర ఎందుకు ఉండదని పోటీతత్వంతో సాగు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి జాతిపై జరిగినట్టే!



మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: విజయవాడ నడిబొడ్డున వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ కార్యకర్తలు, అల్లరిమూకలు దాడి చేయడం జాతిపై జరిగిన దాడిగా చూడాలని మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలో అరాచకాలు, దాడులు జరుగుతున్నాయని, ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని తప్పుదారి పట్టిస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని నాగార్జునరెడ్డి విమర్శించారు. గతంలో ఎప్పుడూ కూడా శిలాఫలకాలను, విగ్రహాలను ధ్వంసం చేయలేదని, ఇప్పుడు కొత్త సంస్కృతి మొదలైందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



కొమరోలు : వర్షం లేకపోవడంతో బీళ్లుగా ఉన్న పొలం

చినుకు రాలదు.. చింత తీరదు

- కొమరోలు మండలంలో కరువు ఛాయలు
- వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు
- ఆగస్టు వచ్చినా బీడుగా ఉన్న పంట పొలాలు



కొమరోలు : బీడు భూమిలో పశువులను మేపుతున్న దృశ్యం

కొమరోలు: మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతన్నలు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా విస్తారంగా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎలాంటి పంట సాగు చేయకపోవడంతో పంట పొలాలు బీళ్లుగా మారాయి. జూన్ నెలలో పడిన తొలకరులకు కొంతమంది పంటలు సాగు చేసినా ఆపై వరుణుడు కరుణించకపోవడంతో ఆ పంటలు వాడిపోయాయి. రైతన్నలు తమ పశువులను బీడు భూముల్లో మేతకు పంపిస్తున్నారు. ఎలాంటి పనులు లేక కర్షకులు ఖాళీగా కూర్చుంటున్నారు.

ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం ఇలా...

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సంవృద్ధిగా వచ్చినట్లయితే పంట పొలాలు ఇప్పటికే సాగులో ఉండి పచ్చదనంతో కళకళలాడేవి. మండలంలో 4872 హెక్టార్లకు గాను 2123 హెక్టార్లలో మాత్రమే పంట సాగైంది. కంది 1417 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, కేవలం 297 హెక్టార్లలో మాత్రమే సాగయింది. వరి 379 హెక్టార్లకు గాను 23 హెక్టార్లలో, నువ్వుపంట 534 హెక్టార్లకు గాను 99 హెక్టార్లలో, పత్తి 589 హెక్టార్లకు గాను 16 హెక్టార్లలో, పెసర 125 హెక్టార్లకు గాను 18 హెక్టార్లలో, మిరప 123 హెక్టార్లకు గాను 25 హెక్టార్లలో మాత్రమే సాగైంది. తొలకరుల సమయంలో సాగు చేసిన పంటలకు కూడా ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. బోరు కింద ఉన్న పొలాలు మాత్రమే సాగులో ఉన్నాయి. వర్షాలు లేకపోవడంతో తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి



మూడు నెలలుగా వర్షాలు కురవక పోవడంతో పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి. మేము వర్షాధార పంటలపైన ఆధారపడి జీవించే రైతులం. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మా పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– మద్దులేటి, రైతు

వర్షాలు లేక సేద్యం చేయలేదు



గత మూడేళ్లుగా సంవృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది కూడా వర్షాలు కురుస్తాయనే ఉద్దేశంతో 10 ఎకరాల పంట పొలాన్ని కౌలుకు తీసుకున్నాం. కానీ వర్షాలు కురవకపోవడంతో ఆ పొలంలో ఎలాంటి పంట సేద్యం చేయలేదు. కౌలు రూ.1.30 లక్షలు రైతు యజమానికి ఖచ్చితంగా కట్టాలి. ఇక వర్షాలు పడతాయనే నమ్మకం లేదు.

– లక్ష్మీదేవి, రైతు

మృతులకు నివాళి



మంగమూరి పొలయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్: మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోలమ్మ గారి భర్త పొలయ్య గారు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పోలయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బోడిచెర్ల గ్రామంలో..

తర్లుపాడు మండలం బోడిచెర్ల గ్రామానికి చెందిన తానుగుండాల అల్లూరిరెడ్డి (66) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అల్లూరి రెడ్డి మృత దేహానికి నివాళులర్పించారు.

సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారు

- సీఎం చంద్రబాబుపై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి ధ్వజం

బేస్తవారిపేట: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశాడని కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్ తులసి రెడ్డి అన్నారు. శనివారం బేస్తవారిపేటలోని రాష్ట్ర నాయకుడు చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి గృహంలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలు ప్రవేశపెట్టారని, వాటిల్లో ప్రధానంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ నెరవేర్చకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఈ పథకం అమలవుతుందా లేదా అనుమానం రైతుల్లో నెలకొందన్నారు. విద్యారంగంలో తల్లికి వందనం జీఓ 29 తీసుకొచ్చి తల్లికి ఒకరికి మాత్రమే పథకం వర్తించేలా విడుదల చేశారన్నారు. జీఓను సవరిస్తామంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీపంలోని హైస్కూల్స్‌లో కలిపి అప్‌గ్రేడ్ చేస్తే, నేడు ఈ ప్రభుత్వం విద్యారంగంలో జీఓలు మార్చి ఒకటి, రెండో తరగతుల్లో 10 మందిలోపు పిల్లలు ఉంటే మూతవేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో 5 వేల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అన్న క్యాంటీన్లు పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేసి పేదలకు రూ.5 అన్నం పెట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ ఖజానా అంటూ సన్నాయి నొక్కులు

పొదిలి: ఎన్నికలకు ముందు జనాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, పథకాలు అమలు చేయకుండా ఖాళీ ఖజానా అంటూ కూటమి ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ ఎస్.తులసిరెడ్డి విమర్శించారు. పొదిలి పట్టణం దర్శి రోడ్డులోని ఎస్‌వీ గార్డెన్‌లో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సామాజిక పింఛన్ల పెంపు అనే ఒక హామీ తప్ప సూపర్ సిక్స్‌లో మరి ఏ హామీ నెరవేరలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలవుతోందని, హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని నిలదీశారు. ఖాళీ ఖజానా అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, ఎన్నికలకు ముందు అలవికాని హామీలు ఇచ్చేటప్పుడు తెలియదా ఖజానా పరిస్థితి అంటూ ప్రశ్నించారు. భృతి ఇవ్వక పోవటం నిరుద్యోగులను మోసం చేయటం కాదా అన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మకు వందన అందజేస్తామన్నారు కానీ ఇప్పుడేమో జీవోలు మాత్రం ఒకరికేనంటూ మాట తప్పుతున్నారన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రైతులకు సాయం అందించిందన్నారు. ఇప్పుడేమో పథకం పేరు మారింది కానీ, రైతులకు సాయం అందలేదన్నారు. ప్రతి మహిళకు 59 సంవత్సరాలలోపు ఉంటే నెలకు రూ.1500 అందచేస్తామన్నారు, బీసీ ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ అన్నారు, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామన్నారు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణమని హామీలు మాత్రం ఇచ్చారు, మరి ఈ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పటం లేదన్నారు. సమావేశంలో పొదిలిలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్.సైదా, జిల్లా కిసాన్ సెల్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తులసిరెడ్డి